జగన్న విద్యాదీవెన సాయం మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్

జగనన్న విద్యాదీవెన సాయం

రూ.29.25 కోట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకం కింద 35,056 మంది విద్యార్థులకు సంబంధించి 31,576మంది తల్లుల ఖాతాలకు రూ. 29.25 కోట్లను జమ చేసినట్లు కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యాదీవెన పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో "జగనన్న విద్యా దీవెన పథకం" కింద 35,056 మంది విద్యార్థులకు సంబంధించి 31,576మంది తల్లుల ఖాతాలకు రూ.29.25 కోట్ల జమ చేశామన్నారు.కాలేజీ ఫీజులు గతంలో నేరుగా మేనేజ్‌మెంట్ ఖాతాలకు జమ అయ్యేవని, ప్రస్తుత ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాలను ఉపయోగించుకుని తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ యువత కనే కలల సాకారంలో జగనన్న ఎప్పటికీ అండగా ఉంటారన్నారు. అనంతరం జగనన్న విద్యా దీవెన పథకం మెగా చెక్కును విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కుశల్ జైన్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అడిషనల్ ఎస్పీ హనుమంతు, ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ రీజనల్ ఛైర్‌పర్సన్ మంజుల, సీడబ్ల్యూసీ ఛైర్ పర్సన్ మేడా రామలక్ష్మి, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ పర్సన్ రిజ్వాన్, కార్పొరేటర్ సైఫుల్లా, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అన్నా దొర, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖుష్బు కొఠారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్ఎమ్ డి.రఫీ పాల్గొన్నారు.

'కొండ'ంత అవినీతి..!

'ఎవరేమనుకుంటే మాకేమి... మాలాభం మాక్కావాలి' అన్నట్లుంది బుక్కరాయసముద్రం అధికార వైసిపి నేతల తీరు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా కాజేసేందుకు కుట్ర చేస్తున్నారు. ఒక్కో నేత 6 సెంట్ల స్థలం తీసుకునేలా పక్కా స్కెచ్ వేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి పట్టాలు పొందేందుకు అన్ని ఏర్పాట్లనూ చేసుకున్నారు. ఏకంగా కొండను చదును చేసి అందులో స్థలాన్ని కాజేసేలా 'కొండ'ంత అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

- ప్రభుత్వ స్థలంపై అధికార పార్టీ నేతల కన్ను
- బికెఎస్ అడ్డతిప్పకొండ తవ్వేసి స్థలం కాజేసే కుట్ర
- ఒక్కో నాయకుడు ఆరు సెంట్లు తీసుకునేలా స్కెచ్
- 'అధికార'ఒత్తిడితో సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో అధికార పార్టీ నేతలకు అప్పన్నంగా ప్రభుత్వ భూమిని కట్టబెట్టే కుట్ర చేస్తున్నట్లు బహిరంగ ఆరోపణలు విన్పిస్తున్నాయి. అనంతపురం జిల్లా కేంద్రం సమీపంలోని బుక్కరాయసముద్రం సచివాలయం-4కు కూతవేటు దూరంలో ఉన్న అడ్డతిప్పకొండను తవ్వేసి, ఇందులో అధికార పార్టీ నేతలు పట్టాలు తీసుకుని కాలనీ ఏర్పాటు చేసుకునే కుట్ర జరుగుతోంది. అనంతపురం నగరం, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అతిసమీపాన బుక్కరాయసముద్రం మండలం ఉంది. ఇక్కడ భూములకు భారీగా ధరలు ఉన్నాయి. బికెఎస్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం, సచివాలయం-4కు కూతవేటు దూరంలో ఉన్న అడ్డతిప్పకొండను తవ్వేసి అందులో పట్టాలు తీసుకునేలా అధికార పార్టీ నేతలు పక్కా స్కెచ్ వేశారు. అధికార పార్టీ నియోజకవర్గ నాయకులతో కూడగలుపుకుని వైసిపి మండల నాయకులు పక్కా ప్రణాళికతో అడ్డతిప్పకొండ కింద చదును చేశారు. ఇక్కడ ఒక్కొక్క వైసిపి నాయకుడు ఆరు సెంట్లు ప్రకారం స్థలం తీసుకునేలా అధికారులపై ఒత్తిడి చేసి, రికార్డులు తయారు చేయించే ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేతలు చేస్తున్న ఈ పనిపై ఆ పార్టీలోని కార్యకర్తలే తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. నాయకులుగా చెలామణి అవుతూ ఇలా ప్రభుత్వ స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా తీసుకోవడం ఏమిటంటూ గుసగుసలాడుతున్నారు. అన్ని అర్హతలున్న పేదలకోమే ఒకటిన్నర సెంటు, ఖద్దర్ వేసుకున్న నాయకులకు ఆరు సెంట్లు ఇవ్వడం ఏమిటంటూ పలువురు మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్థలాన్ని కాజేయాలని చూస్తున్న అధికార పార్టీ నాయకులు, వారికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణం వీటిపై దష్టి సారించి కబ్జా కాబోతున్న కొండ స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేస్తున్నారు.

గతంలోనూ కొండలో మట్టిమాఫియా

అడ్డతిప్పకొండ చుట్టూ అధికార పార్టీ నేతల చేస్తున్న అవినీతి ఇప్పటిది కాదు. గతంలోనూ ఈ కొండపై అధికార మట్టి మాఫియా కన్ను పడింది. ఏకంగా కొండ నుంచి రూ.3 కోట్ల విలువజేసే మట్టిని యథేచ్ఛగా తవ్వి తరలించేశారు. మట్టి తవ్వకాల వల్ల పర్యావరణ సముతుల్యత ఏర్పడి, సమీప వ్యవసాయ పొలాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అప్పట్లో సిపిఎం దీనిపై పోరాటం చేసింది. అధికారులను కలిసి విజ్ఞాపన పత్రాలను అందజేసింది. అధికారులు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి మట్టి తరలింపును పూర్తి స్థాయిలో అడ్డుకోలేకపోయారు. ఇప్పుడు ఏకంగా కొండ ప్రాంతం స్థలాన్ని నాయకులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది.

చదును చేసిన అడ్డతిప్పకొండ ప్రాంతం

అధికారం ముసుగులో కబ్జా

అడతిప్పకొండ చుట్టూ అధికార పార్టీ నేతలు స్థలాలను తీసుకునే ముసుగులో కబ్జాకు యత్నిస్తున్నారు. ఇప్పటికే ఈ కొండలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి మాఫియా రూ.3 కోట్ల రూపాయల మట్టిని తవ్వేసింది. దీనిపై అప్పట్లోనే సిపిఎం అడ్డుకుని, అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పుడు ఏకంగా స్థలాన్ని కాజేసే కుట్ర జరుగుతోంది. స్థలాల మంజూరులో పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు ఒక న్యాయం ఉండకూడదు. నాయకుల్లో కూడా నిజమైన పేదలుంటే ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకటిన్నర సెంటు తీసుకోవడంలో ఎలాంటి అభ్యంతరం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అరు సెంట్లు తీసుకోవడం సరికాదు. దీనిని అధికారులు అడ్డుకోవాలి. అడ్డతిప్పకొండలో అర్హులైన పేదలందరికీ పట్టాలు ఇవ్వాలి.

ఆర్.కుళ్లాయప్ప,
సిపిఎం మండలకార్యదర్శి.

విచారణ జరిపిస్తాం..

అడ్డతిప్ప కొండకు సంబంధించి స్థలాల మంజూరు విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరిపిస్తాం. ఎవరికైనా నిబంధనల మేరకే ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తాం.

మోహన్‌కుమార్, తహశీల్దార్
బుక్కరాయసముద్రం.

ఆసుపత్రిలో చిన్నారుల వార్డును పరిశీలిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రభుత్వ వైద్యం మరింత బలోపేతం

స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రభుత్వ వైద్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. బుధవారం ఆమె కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన ఆపరేషన్ థియేటర్, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. బాల్యవివాహాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఆసుపత్రిలో పిల్లల వార్డును పరిశీలించి అక్కడ అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పని చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

29 నుంచి సబ్సిడీ వేరుశనగ పంపిణీ

జెడిఎ బి.చంద్రానాయక్

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్ సాగుకు రైతులకు అవసరమైన సబ్సీడీ వేరుశనగ కాయలను ఈనెల 29వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈనెల 29వ తేదీ నుంచి సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే విత్తనాలు కోసం రైతులు రిజిస్ట్రేషన్ ప్రారంభం అయ్యిందన్నారు. విత్తన నాణ్యత ప్రమాణాలు, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ పర్యవేక్షణ కోసం వ్యవసాయ అధికారులను నియమించామని తెలిపారు. అక్కడి నుంచి రైతుభరోసా కేంద్రాలకు వచ్చిన విత్తన కాయలను స్థానిక రైతులు బాగుందని ధ్రువీకరణ చేసిన తరువాతనే పంపిణీకి సిద్ధంగా ఉంచుతామన్నారు. ఇప్పటి వరకు విత్తనం కోసం 30,557 మంది రైతులు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. రైతులకు అవసరమైనన్ని విత్తనకాయలను మండలాల్లో అందుబాటులో ఉంచాలని ఏపీ సీడ్స్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు. వేరుశనగతో పాటు అంతర్ పంటల విత్తనాలు కోసం గురువారం నుంచి రైతులు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకోచ్చని జెడిఎ తెలిపారు.

ఆర్‌బికెల్లో సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు

ప్రజాశక్తి-యాడికి

రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు విత్తు కోవడానికి పంపిణీ చేసే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు. రాయల చెరువు, పుప్పాల ఆర్‌బికె కేంద్రాలకు విత్తానాలు వచ్చాయన్నారు. ఖరీఫ్ ప్రారంభం నాటికి అన్ని రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు.

కేశవరెడ్డి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కేశవరెడ్డి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నగరంలోని కేశవరెడ్డి విద్యా సంస్థల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ కేశవరెడ్డి విద్యా సంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. గతంలో కూడా ఈ విద్యా సంస్థ తల్లిదండ్రుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసం చేసిందన్నారు. మళ్లీ అలాంటి విద్యా సంస్థకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం విచారకరం అన్నారు. తక్షణం ఈ కేశవరెడ్డి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ డీఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

ఐదేళ్లుగా పూర్తవని ఆధునీకరణ..!

- జిబిసి, మిడ్‌పెన్నార్ సౌత్ పనులు అసంపూర్తి
- పనుల పూర్తిపై మీనమేషాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుల్లో ఒకటిగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిధిలోకి వచ్చే రెండు ప్రధాన కెనాల్ ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభమై ఐదేళ్ల కావస్తున్నా అసంపూర్తిగానే ఉన్నాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా గత కొంతకాలంగా పనులు ఆగిపోయి ఉన్నాయి. ఇప్పుడు చెల్లింపులు జరిగినా అన్‌సీజన్‌లో ప్రారంభించడానికి కాంట్రాక్టరు ముందుకొచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో మధ్యలోనే ఆధునీకరణ ఆగింది.

జిబిసి(గుంతకల్లు బ్రాంచ్ కెనాల్)

హెచ్ఎల్ఎంసి నుంచి పాల్తూరు వద్ద గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌గా విడిపోయి ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాలకు సాగునీటిని అందిస్తుంది. 59.40 కిలోమీటర్లు ఉండే ఈ కాలువ కింద 15,760 ఎకరాల ఆయకట్టు ఉంది. 2.77 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. ఇది పూర్తిగా దెబ్బతిని ప్రవాహ సామర్థ్యం మేరకు నీటి ప్రవాహం వెళ్లే పరిస్థితుల్లేకపోవడంతో 2016వ సంవత్సరంలో ఈ కాలువ ఆధునీకరించాలని నిర్ణయించి టెండర్లు పిలిచారు. రూ.234.67 కోట్లతో చేపట్టిన ఆధునీకరణ పనులు రూ.188.69 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అయితే తక్కిన పనులు మధ్యలోనే ఆగిపోయి ఉన్నాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదన్న ఉద్దేశంతో మధ్యలోనే పనులను ఆపారు. ఈ బిల్లులు ఇటీవలి కాలంలో వచ్చాయి. తరువాత జరిగే పనులకు కూడా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగే అవకాశముందన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. అధికారులేమో ఇప్పుడు అన్‌సీజన్ కాబట్టి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు అందించారు.

మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువదీ అదే స్థితి

మిడ్ పెన్నార్ నుంచి దక్షిణ కాలువ బయలుదేరుతుంది. ఇది కడప జిల్లా వరకు వెలుతుంది. సుమారు 44.44 కిలోమీటర్లు ఈ కాలువ వెలుతుంది. దీని కింద 22,708 ఎకరాల ఆయకట్టు ఉంది. 4.32 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. జిల్లాలోనున్న ప్రధాన కాలువల్లో ఇదీ ఒకటి. ఈ కాలువ ఆధునీకరణ కూడా రూ.509.16 కోట్లతో చేపట్టారు. మూడు ప్యాకేజీల్లో చేపిట్టిన ఈ పనులు ఇప్పటికి రూ.205.79 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. పెండింగులోనున్న పనుల్లో ప్రధానంగా ఐదు డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం జరగాల్సి ఉంది. కాని మధ్యలోనే ఆగిపోవడంతో డిస్ట్రిబ్యూటరీల నుంచి రైతులకు ఆయకట్టుకు నీరందడంలో సమస్య ఉంది. బిల్లులు పెండింగులో ఉన్నాయని పనులను ఆపి కాంట్రాక్టరు, పనులు పూర్తయినా ఇక తాను చేయలేనని చేతులెత్తేశాడు. క్లోజ్ చేయమని అధికారులకు లేఖను అందజేశారు. అధికారులు ఇప్పటికీ దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఆధునీకరణ పూర్తి చేయాలి
చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

జిల్లాలో వర్షాపాతం తక్కువ కాబట్టి ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. దీనికి కాలువల ఆధునీకరణ పూర్తి చేయాలి. జిల్లాలో ఏ ఒక్క సాగునీటి కాలువ కూడా సక్రమంగా లేదు. పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. అన్నీ కాలువలు కూడా పనులు ప్రారంభమై మధ్యలో ఆగి ఉన్నాయి. దీని వలన రైతులకు సక్రమంగా సాగునీరు అందటం లేదు. పంటల సాగుకు ఉపయోగపడడం లేదు. పైగా నీటి వృథా కూడా ఎక్కువగా ఉంటోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీటి కాలువల ఆధునీకరణ పూర్తి చేయాలి.

రైల్వే ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గుంతకల్లు

రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారులు హెచ్చరించారు. రైల్వే ట్రాక్‌లపై రాళ్ళు, ఇతర వస్తువులు పెట్టినా, బోగీలపై రాళ్ళు రువ్వినా కఠిన చర్యలు తీసుకుంటామని జిఆర్‌పి ఎస్ఐ మహేంద్ర, ఆర్పిఎఫ్ ఏఎస్ఐ వీరేష్ పట్టణంలో రైల్వే ట్రాక్ సమీప కాలనీల వాసులను హెచ్చరించారు. పట్టణంలోని ధర్మవరం రైల్వే గేట్, సోఫియా స్ట్రీట్, ఎస్జేపి హైస్కూల్, పిఅండ్‌టి కాలనీల ప్రజలకు రైల్వే పోలీసులు రైల్వే చట్టాలపై అవగాహన కల్పించారు. రైళ్ల రాకపోకల సమయంలో బోగీలపై రాళ్లు వేయడం, రైలు పట్టాలపై రాళ్లు, ఇతర వస్తువులు పెట్టడం చట్టరీత్యా నేరమని, రైల్వే చట్టాలు కఠినంగా ఉంటాయని తెలిపారు. రైల్వే ట్రాక్‌లపై నడుచుకుంటూ వెళ్తున్న, రైల్వే ట్రాక్‌ల పక్కన నివాసం ఉన్న, ఆ ప్రాంతంలో తిరుగుతున్న వ్యక్తులను పిలిచి వారికి రైల్వే చట్టాలపై అవగాహన కల్పించి హెచ్చరించారు. ఇలాంటివి జరిగితే రైల్వేలో పెద్ద పెద్ద కేసులు అవుతాయని బెయిల్ కూడా రాదని స్పష్టం చేశారు.

రైల్వే చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారులు

గడువులోపు గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

ఉరవకొండ : జగనన్న లే అవుట్‌లలో గృహ నిర్మాణాలను గడువు లోపు పూర్తి చేయాలని హౌసింగ్ పిడి కేశవనాయుడు అధికారులను ఆదేశించారు. అలాగే గృహ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల ఇళ్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన బుధవారం విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, హౌసింగ్ డిఇ హనుమన్నతో కలిసి మండల పరిధిలోని గడేకల్ గ్రామం జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు, లబ్ధిదారులకు బిల్లుల పంపిణీలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హౌసింగ్ అధికారులను హెచ్చరించారు. జగనన్న కాలనీలలో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్లు, విద్యుత్, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కావున లబ్ధిదారులు వీలైనంత తొందరలో గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారన్నారు. ఆయన వెంట తహశీల్దార్ బ్రహ్మయ్య, హౌసింగ్ ఏఈ అనిల్ కుమార్, వైసిపి నాయకులు కరణం భీమారెడ్డి, ఆర్ఐ గోవింద్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

మంత్రి ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం : రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయంటే ఆ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పింజరికొట్టాల, కడదరకుంట గ్రామాల్లో బుధవారం 'గడప గడపకూ జగనన్న ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా మంత్రి గ్రామంలో కలయ తిరుగుతూ ప్రతి ఇంటిగడప సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న అధికారులతో చర్చించి ఆయా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలను చూపించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ రీసర్వేకు సహకరించాలి

గుత్తి : భూ రీసర్వేకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని తహశీల్దార్ ఎస్. మహబూబ్ బాషా కోరారు. రైతులకు సంబంధించి భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం 'జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలో భూ రీసర్వే చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కుందుర్పి : ఉచిత టైలరింగ్ శిక్షణకు మండలంలోని గ్రామీణ ప్రాంత మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్వీ ఛారిటబుల్ ట్రస్ట్, అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రజా గాయకుడు ఎస్.కె లెనిన్‌బాబు సూచించారు. కుందుర్పిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బండమీదపల్లి సహకార సంఘం భవనంలో జూన్ 5వ తేదీ నుంచి 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పాస్ లేదా ఫెయిల్ అయిన 18-35 ఏళ్ల వయసు గల మహిళలు రెండు పాస్ ఫొటోలు, ఆధార్ కార్డుతో ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న 36 మందికి మాత్రమే శిక్షణ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలకు 79895 87851, 63046 59980, 97010 43369 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు వాలంటీర్లకు సన్మానం

నార్పల: నార్పలలోని షాదీఖానాలో గురువారం(నేడు) ఉదయం 10 గంటలకు వాలంటీర్ల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ దివాకర్ బుధవారం తెలిపారు. అందులో భాగంగా ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర పాఠశాల విద్య సలహాదారు సాంబశివారెడ్డి, జడ్పీ వైర్మన్ గిరిజమ్మ అత్యుత్తమ వాలంటీర్లుగా ఎంపికైన వారిని సన్మానిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

మందకృష్ణపై మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు

నార్పల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం నార్పలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యం లో పెద్దిరెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు కార్యక్రమాన్ని రూపొందించారు. అయితే పోలీసులు స్థానిక నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఉదయాన్నే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు రంగాపురం పుల్లప్ప మాట్లాడుతూ దళితుల హక్కులకై అహర్నిశలు కష్టపడుతున్న మందకృష్ణ మాదిగపై పెద్దిరెడ్డి వ్యాఖ్యలు సరికాదన్నారు. మరోకసారి తమ నాయకున్ని విమర్శిస్తే మాదిగల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హనుమంతు, ప్రసాద్, వీరప్ప, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని కాపాడుకుందాం

డి.హీరేహాళ్ : ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు ఉపాధి, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున తరలిరావాలని ఏపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో తీసుకొస్తున్న నూతన విధానం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూలీలకు సమ్మర్ అలవెన్స్ కింద 40% అదనంగా ఇవ్వాలని వంద రోజులు పని పూర్తి చేసిన కూలీలకు మరో వంద రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆయా డిమాండ్ల సాధన కోసం ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రతి కూలీ పాల్గొనాలని కోరారు. ఆయన వెంట సిపిఎం నాయకులు లోకేష్ ఉన్నారు.

గుత్తిలో వేసవి విజ్ఞాన శిబిరం

గుత్తి: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ అధికారి హెచ్.రామాంజనేయులు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత గ్రంథాలయాధికారి ఏసి.సుబ్బన్న, రిటైర్డ్ పోస్ట్‌మ్యాన్ పి.కాశీంపీరా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

సబ్ స్టేషన్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే సీఎం జగన్, ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పేర్కొన్నారు. వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్‌కి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సబ్ స్టేషన్ నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేసి కొనకొండ్ల, ఛాయాపురం, గూళపాళ్యం, కమలపాడు, తండా, పొట్టిపాడు, చిన్న హోతూరు, గడేహోతూ రు గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే ఉరవకొండ నియోజకవర్గం లో విద్యుత్ కోతలు లేకుండా, 10 గ్రామాలకి ఒక సబ్ స్టేషన్ నిర్మిస్తామన్నారు. భవిష్యత్తులో నియోజక వర్గం అభివద్ధికి మరింతగా కృషి చేస్తామన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో చేసిన వాగ్దానాలన్నింటినీ సీఎం జగన్ నెరవేరుస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. గత టిడిపి ప్రభుత్వం అవినీతిపాలన చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందన్నారు. వైసిపి ప్రభుత్వం ఎన్ని కష్టాలు ఎదురైనా పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్ స్టేషన్ నిర్మించే శ్రీషిరిడీ సాయి ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సైట్ మేనేజర్ రవి, ఎలక్ట్రికల్ డిఈ రాజశేఖర్, డిప్యూటీ ఏడి మహేష్, ఏఈ చంద్రశేఖర్, మాజీ ఎంపిపి రామచంద్ర, ఎంపిటిసిలు పాపన్న, ముద్దయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

కమిషనర్ రమణారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఆయన సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా అనంతపురం నగర పాలక సంస్థ ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణకు ప్రజలంతా సహకరించాలన్నారు. హోటళ్లు, వ్యాపార, వాణిజ్య కార్యాలయాల నిర్వాహకులు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చూడాలని, అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. ఆస్తి పన్ను, యూజర్ ఛార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయా లన్నారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలన్నారు. మెప్మా విభాగం, వార్డు వాలంటీర్లు, ఇతర కార్యదర్శులతో కలిసి యూజర్ ఛార్జీల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. యూజర్ ఛార్జీల వసూళ్లలో వెనకబడినట్లు తెలుపుతూ అసంతప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, యూజర్ ఛార్జీలు క్రమం తప్పకుండా సకాలంలో వసూలు చేయాలన్నారు. అనంతరం స్పందన ఫిర్యాదులపై అవగాహన కల్పిస్తూ అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, హెల్త్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్, శానిటరీ సెక్రటరీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

కలుషిత నీటిని చూపిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

కలుషిత నీరు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న విడపనకల్లు మండల ఆర్‌డబ్ల్యుఎస్ జేఈతో పాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కేంగూరి ఎర్రిస్వామి, అల్లప్ప డిమాండ్ చేశారు. వారు బుధవారం విడపనకల్లు మండల కేంద్రంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుతో పాటు తాగునీటి ఫిల్టర్ బెడ్లను పరిశీలించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిడిఒ కార్యాలయం వెనుక ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, తాగునీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్లలో చెత్త చెదారం పేరుకుపోయి నీరు కలుషితం అవుతున్నాయన్నారు. అదే నీరు సరఫరా చేస్తుండడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు రోగాల బారినపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇంత జరుగుతున్నా మండల కేంద్రంలోని కార్యాలయానికి రాకుండా ఎక్కడో ఉంటూ విధులు నిర్వహిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ జేఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి మండల కేంద్రంలో ఉన్న ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం

సదస్సులో మాట్లాడుతున్న ఎంపిపి పుష్పవతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

బాల్య వివాహాల నిర్మూలన కు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్ రెడ్డి, జడ్పిటిసి హనుమంతు పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆడపిల్లలను తక్కువ చేసి చూడడం, ఆర్థిక భారంగా భావించడం, పేదరికం, నిరక్షరాస్యతే బాల్య వివాహాలకు ప్రధాన కారణం అన్నారు. కావున బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. చిన్న వయసులో వివాహం జరగడం వల్ల కాన్పు కష్టం కావడమే కాకుండా ప్రసూతి, శిశు మరణాలు జరుగుతాయన్నారు. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత పెళ్లి చేస్తే జగనన్న ప్రభుత్వం వైఎస్ఆర్ పెళ్లి కానుకలో భాగంగా అన్ని వర్గాలకు ఆర్థిక సాయం చేస్తుందన్నారు. సదస్సులో ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ బ్రహ్మయ్య, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, సర్పంచిలు కేశన్న, రామాంజనేయులురెడ్డి, ఐసిడిఎస్ అధికారులు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు దుర్మార్గం

వామపక్షాల నాయకులు

వజ్రకరూరు పోలీస్ స్టేషన్ సిపిఎం

ప్రజాశక్తి-ఉరవకొండ

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఉరవకొండకు వస్తున్న సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకు లను ముందస్తుగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని వామపక్ష పార్టీల నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార మాట్లాడుతూ ఉరవకొండ, వజ్రకరూరు మండలాల సిపిఎం అధ్యక్షులు మధుసూదన్, విరుపాక్షి, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డితో పాటు సిపిఐ వజ్రకరూరు మండల అధ్యక్షులు సుల్తాన్‌లను ముందస్తుగా అరెస్ట్ చేసి ఉరవకొండ, వజ్రకరూరు పోలీస్ స్టేషన్లకు తరలించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్య సమస్యలపై పోరాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు, ప్రతిపక్ష పార్టీలను అణిచివేసే ధోరణితో వ్యవహరిస్తున్న బిజెపి, వైసిపి ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల: మండల పరిధిలోని తరిమెల గ్రామానికి చెందిన మల్లిశెట్టి లక్ష్మీదేవమ్మ, మల్లిశెట్టి మల్లేష్ దంపతుల కుమార్తె శాంతి వివాహానికి బుధవారం జడ్పిటిసి కంచిరెడ్డి సుధ, భాస్కర్‌రెడ్డి దంపతులు రూ. 10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం చేయడం సంతోషంగా ఉందన్నారు.

గుండె శస్త్ర చికిత్సల్లో 'కిమ్స్ సవేరా' సరికొత్త విప్లవం

కీ హోల్ ఆపరేషన్లకు 'ఆరోగ్యశ్రీ' వర్తింపు : డాక్టర్ సందీప్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న ఆస్పత్రి వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం

గుండె శస్త్ర చికిత్సల్లో అనంతపురం నగరంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రి సరికొత్త విప్లవానికి నాంది పలికిందని సీనియర్ కన్సల్టెంట్ కార్డియో థొరాసిక్, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ కె.సందీప్‌రెడ్డి తెలిపారు. స్థానిక కిమ్స్ సవేరా ఆస్పత్రిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రక్తనాళాలు పూడుకుపోవడం, వాల్వులు పాడవ్వడం లాంటి సమస్యలకు మినిమల్లీ ఇన్వేజివ్ పద్ధతి(కీ హోల్)లో శస్త్రచికిత్స చేయొచ్చని నిరూపించామ న్నారు. ఈ తరహా శస్త్రచికిత్స చేయించుకోవాలంటే రాయలసీమ వాసులు గతంలో హైదరాబాద్, బెంగళూరు వెళ్లాల్సి వచ్చేది, ఇప్పుడు కిమ్స్ సవేరాలో అందుబాటులోకి తెచ్చామన్నారు. 2 నెలల్లో ఈ తరహా ఆపరేషన్లు 25కి పైగా చేశామన్నారు. సాధారణంగా ఛాతి ఎముకలను కత్తిరించి గుండెకు శస్త్రచికిత్స చేసి తర్వాత మళ్లీ వాటిని అతికిస్తారు. ఆ పద్ధతిలో రోగి కోలుకునే సమయం, ఇన్ఫెక్షన్లు, నొప్పి, రక్తస్రావం అన్నీ ఎక్కువే అన్నారు. ఎద మీద పెద్ద మచ్చ అలాగే ఉండిపోతుంది. మినిమల్లీ ఇన్వేజివ్ లేదా కీ హోల్ పద్ధతిలో అతి తక్కువ కోతతో శస్త్రచికిత్సను పూర్తిచేస్తారు. రోగి త్వరగా కోలుకుంటాడు, నొప్పి, రక్తస్రావం తక్కువ, ఇన్ఫెక్షన్లు వ్యాపించవు, ఎద భాగంలో మచ్చలు ఉండవు అన్నారు. ఈ శస్త్రచికిత్సకు ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుంది, కావున పూర్తి ఉచితంగా చేయించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజు, శ్రీనివాసప్రసాద్, చంద్రశేఖర్, ఆస్పత్రి సిబ్బంది, పిఆర్ టీం గిరి, రఘు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా ప్రమాణాలకు నెలవు 'అప్లాటస్'



గుత్తా గణేష్ సాయి | డి.మేఘనాథ్ | శ్రీఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

నాణ్యమైన విద్యా ప్రమాణాలకు నెలవు అనంతపురం నగరంలోని 'అప్లాటస్ గ్లోబల్ స్కూల్' అని కరస్పాండెంట్, ప్రిన్సిపల్ సాల్మన్ రాజ్ తెలిపారు. ఆయన బుధవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ దశాబ్ద కాలంగా తమ విద్యా సంస్థ నాణ్యత, విలువలతో అన్ని రంగాల్లో అసా ధారణ ఫలితాలు సాధిస్తూ ముందుకెళ్తుందని తెలిపారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో గుత్తా గణేష్ సాయి 589, డి.మేఘనాథ్ 584, ఎర్రపరెడ్డి శ్రీఖర్‌రెడ్డి 582 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ఖ్యాతి గడించారన్నారు. అలాగే 550కి పైగా 22 మంది, 500కి పైగా 50 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ కరికులంలో క్షేత్రస్థాయిలో శిక్షణ అందిస్తున్నామన్నారు. చదువుతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్ది ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. డే స్కాలర్స్, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ సౌకర్యాలను అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో నిరంతరం యాజమాన్యం పర్యవేక్షణలో కల్పిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ వి.నాగలింగారెడ్డి అభినందించారు.

చికిత్స, పౌష్టికాహారంతో క్షయ నివారణ



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి హరినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సరైన చికిత్సతో పాటు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే క్షయవ్యాధి నివారణ సాధ్యమని ప్రభుత్వ వైద్యాధికారి హరినాథ్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో బుధవారం క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను వాడితే క్షయ వ్యాధిని నివారించవచ్చన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేయడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లక్ష్మీనారాయ ణ, ట్రెజరర్ నజీర్, రీజనల్ ఛైర్మన్ బాలచంద్ర, గణేష్‌బాబు, ప్రభాకర్ నాయుడు, నాగేశ్వర రావు, ప్రభాకర్‌నాయుడు, సురేంద్ర, వైద్య సిబ్బంది, టిబి ల్యాబ్ సూపర్‌వైజర్ మాణిక్యాల రావు, ఎస్‌టిఎల్ఎస్ కుళ్లాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డా॥మౌనికకు రాష్ట్రస్థాయి అభినందన పత్రం

రాష్ట్రస్థాయి అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందుకుంటున్న డా. మౌనిక

శింగనమల: మండల కేంద్రమైన శింగనమలలో వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవలు అందించడంలో డాక్టర్ మౌనిక ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో ఆమె పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ నుంచి రాష్ట్ర స్థాయి అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఆమెను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సుబ్రహ్మణ్యం, డివిజనల్ ఉపసంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, శింగనమల పశుసంవర్ధకశాఖ ఏడి అనంతపద్మనాభం అభినందించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సమస్యలపై నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు

ఆత్మకూరు: మండల పరిధిలోని వడ్డిపల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలని, రోజు కూలి రూ. 600 ఇవ్వాలని, గతంలో మాదిరిగా కూలీలకు గడ్డపారలు, మెడికల్ కిట్లు, మజ్జిగ, వేసవి అలవెన్స్ ఇవ్వాలని, టెంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు హెచ్ రామయ్య, చిరంజీవి, సత్యమయ్య, బి.రామకష్ణ, నరసింహారెడ్డి, లక్ష్మీదేవి, సరస్వతి, పెద్దక్క, తదితరులు ఉన్నారు

ఐటిఐ కళాశాలకు ఫ్రిడ్జ్ అందజేత

ఐటిఐ కళాశాలకు ఫ్రిడ్జ్ అందజేస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి : స్థానిక మార్కెట్ యార్డ్‌లోని ఐటిఐ కళాశాలకు ఫయాజ్ బాషా ట్రస్ట్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా ఫ్రిడ్జ్ బహుకరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం రూ. 17వేల విలువ చేసే 30 లీటర్ల తక్షణ కూల్ వాటర్‌ను అందించే ఫ్రిడ్జ్‌ను ప్రిన్సిపాల్ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫయాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎం.రవికుమార్, శాంతకుమారి, ఎం.రత్నాకర్, రాంబాబు, మౌలాలి, నూరి, షాషావలి, మహబూబ్ బాషా, చవ్వా రాజశేఖర్ రెడ్డి, ఆలూరు ప్రసాద్ రెడ్డి, హెచ్.జునైద్, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి 'నిత్యసురభి' చేయూత

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ వారి పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి బుధవారం ఓ పేద కుటుంబానికి నిత్యావసరాలు, నగదు అందజేశారు. అనంతపు రం నగరంలోని రుద్రంపేట ప్రాంతానికి చెందిన వాలంటీర్ షేక్ హసీన, షేక్ ఫయాజ్(డ్రైవర్) దంప తుల ఇబ్బందులు తెలుసుకున్న నిర్మలమురళి వారి ఇంటికి వెళ్లి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ. 5 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యసురభి పుట్టినిల్లు ఆధ్వర్యంలో పేదలకు అండగా ఉంటామన్నారు. నిత్యసురభి నిర్వహణకు దాతల సహాయాన్ని మరువలేమన్నారు.

నేరాలు ఘోరాలు

దొంగ అరెస్టు.. నగదు స్వాధీనం

గుంతకల్లు: పట్టణంలోని ఆంధ్రా బ్యాంకు వీధిలో ఉన్న మెడ్ ప్లస్ మెడికల్ దుకాణంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి అతడి నుంచి రూ. 31,455 స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో పట్టణ సీఐ రామసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మెడ్ ప్లస్ మెడికల్ దుకాణంలో గత నెల 29న చోరీ జరగడంతో కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో బుధవారం పట్టణంలోని హనుమాన్ కూడలిలో అశోక్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. నిందితుడిని విచారించి గుంతకల్లు పట్టణంలోని శాంసోన్‌పురానికి చెందిన అశోక్‌గా గుర్తించారన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు. పట్టన ప్రజలు ఇంటి ముందు, దుకాణాల ముందు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసిన సెబ్ అధికారులు

తాడిపత్రి రూరల్ : మండలంలో అక్రమ ఇసుక రవాణాపై బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా రూరల్ మండల పరిధిలోని సజ్జలదిన్నె క్రాస్ వద్ద అక్రమంగా 18 టన్నుల ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని డ్రైవర్ విష్ణువర్ధన్‌ను అరెస్టు చేశారు. ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి విచారణ నిమిత్తం తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు సీఐ విజయ్ కుమార్ తెలిపారు. దాడుల్లో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సదుపాయాలు కల్పించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్

గుత్తి కోట రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డి.జగదీష్

ప్రజాశక్తి-గుత్తి

గుత్తికోట రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ డిమాండ్ చేశారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన గుత్తి కోట రైల్వే స్టేషన్‌ను బుధవారం సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు సందర్శించి రైల్వే బుకింగ్ క్లర్క్‌తో రమేష్‌తో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా డి.జగదీష్ మాట్లాడుతూ ఈ రైల్వే స్టేషన్ గుండా ప్రస్తుతం రెండు రైళ్లు మాత్రమే వెళ్తున్నాయని, మరిన్ని రైళ్ల రాకపోకలు జరిగేలా రైల్వే ఉన్న తాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రయాణికులకు తాగునీరు, షెడ్లతో పాటు అదనంగా రైల్వే ప్లాట్ ఫారంలు ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట సిపిఐ అనం తపురం, సత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, హేమాయాదవ్, గుత్తి మండల కార్యదర్శి జి.రామదాసు, నాయకులు డేనియల్, షఫీ, రాజు, రామకష్ణ, తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న విప్ కాపు

రాయదుర్గం: పట్టణంలోని దాసప్ప రోడ్డులో గొంచికారు వెంకట రమణప్ప లేఅవుట్ వద్ద ఉన్న బసవ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా గణపతి, బసవ నాగలింగేశ్వరస్వామి, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యస్వామి, నంది, నవగ్రహ, దేవతల విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ పూర్వక గోపుర శిఖర కలశ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఆలయ జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను కమిటీ పాలకవర్గం పర్యవేక్షించగా, ఏపీ రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో హోమాలు, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, ఏపీఐఐసీ ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, గౌని ఉపేంద్ర రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, వార్డు సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి



మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణ పొలిమేరలో ఎంసిఎ లేఅవుట్ వద్ద ప్రధాన తాగునీటి పైపులైన్‌పై అక్రమ కట్టడాలను తొలగించాలని, నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయదుర్గం పట్టణానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్‌పై ఎంసిఎ లేఅవుట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ విషయం మున్సిపల్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. వెంటనే సంఘటనా స్థలంలో పర్యటించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని వారు కమిషనర్‌ను కోరారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలను సీజ్ చేయాలి

రాయదుర్గం: పట్టణంలో నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక నారాయణ పాఠశాల ముందస్తుగా 300 అడ్మిషన్లు చేసిందని, ఈ విషయాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈఒ నాగమణికి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఎంఈఓ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపిస్తూ ఆమె వైఖరిని ఖండిస్తున్నామన్నారు. నారాయణ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూళ్ల చేస్తుందన్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాల ని, లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయా విద్యాసంస్థలు ముందు పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

డా॥రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

అనంతపురం: డాక్టర్ కె.రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో 3 నెలలుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ రాజురెడ్డి తెలిపారు. అందులో భాగంగా బుధవారం నగరంలోని రెండో రోడ్డులో వైసిపి కార్యాలయం సమీపంలోని కూడలిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా పరీక్షలు చేశారు. అలాగే ప్రజలకు ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శిబిరంలో డాక్టర్ రాజీవ్ రెడ్డి మిత్ర బృందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజీవ్‌రెడ్డి